


అందరి పిల్లల్లా ఖాళీ దొరికి నప్పుడల్లా కుట్లనీ, అల్లిక లనీ, పెళ్ళి కూతుర్నీ, పెళ్ళి కొడుకునీ చేయడమనీ చేయదు వసంత. పదకొండేళ్ల వసంత రేకులో_, మేకులో_, స్క్రూడ్రైవర్లతో, సుత్తులతో యెప్పుడూ యేదో వొకటి చేసి సాధిస్తుంది.

తండ్రి రామనాధానికివన్నీ అంటే విసుగు. కూతుర్ని ఏ పంతులమ్మనో, డాక్టర్నో చెయ్యాలని అతని ఆశ

ఆ వేళ ఊరు నుంచి వసంత తాతయ్య వచ్చారు అయన వసంత తల్లి వసుంధరకు తండ్రి

"మీరొచ్చిన రైలు యే సూత్రం మీద పని చేసిందో చెప్పండి తాతయ్యా' అంటూ గట్టి ప్రశ్న వొకటి వేసింది

ఆయనికి వయసు మాత్రం మళ్ళింది తెలివితేటల్లో పడుచువాళ్ల కంటే ముందే ఉన్నారు

మనవరాలి వేపు కాస్సేపు ఆశ్చర్యపోయి చూశారు.

తన కూతురు వసుంధర అక్కడే నిలబడి ఉంది

అల్లుడు రామనాధం ఆ ప్రశ్నకు సరైన సమాధానం తెలియక బుర్ర గోక్కుంటున్నాడు

ఆ ముసలాయన తన కూతురు వసుంధర ముఖంలోకి సాలోచనగా చూశాడు.

ఆ చూపుల్లో భావన, గతంలోకి లాక్కుపోయిందామెను మళ్ళీ తేరుకుని, "అవున్నాన్నా! యెప్పుడూ ఏదో ఒకటి రిపేరు చేస్తూ_ ఉంటుంది వసంతకు మెకానిక్ పనులంటే చాలా యిష్టం

"నీకు లాగేనన్న మాట" బరువుగా అన్నాడు

తండ్రీ కూతుళ్ల సంబాషణ విన్న రామనాధం నిర్లక్ష్యంగా నవ్వేడు ఆ నవ్వులో వేళాకోళం– వెటకారం!

ముసలాయన మెదడు చురుగ్గానే ఉంది వెంటనే అది గ్రహించి 'చూడు అల్లుడు గారూ! నా కూతుర్ని పొగుడు కుంటున్నానని కాదు, అమ్మాయి వసుంధర కూడా వసంతలాగే యింట్లో యెప్పుడూ ఈ మెకానిక్ పనులు చేస్తుంటే మందలించే వాణ్ణి. చాలా సార్లు కొట్టాను కూడా తాను సైన్సు సబ్జెక్ట్సు తీసుకుని యింజనీరింగ్‌కి వెళ్తానంటే అప్పట్లో నేను కాదన్నాను, ఆర్ట్సు సబ్జెక్ట్సు తీసుకోమని నిర్బంధించాను కాని తన కిష్టంలేని ఆ చదువు అక్కర్లేదంది– కాని ఫస్టు మార్కులు తెచ్చుకునే వసుంధరను తన యిష్ట ప్రకారం ఆ నాడు చదివించి పై చదువులకు పంపుంటే తాననుకున్నట్టు పెద్ద యింజనీరే అయ్యుండేది. కాని నా మూర్ఖత్వం కొద్దీ, అమ్మాయి అభిరుచి గ్రహించలేక, గ్రహించినా అది ఆడపిల్లలకు తగదనీ, వెంటనే యెవర్నో చూసి, పెళ్ళి చేసేద్దామనీ అనుకున్నానే గాని తన కోరికల్ని నెరవేరనివ్వలేదు–

"ఆడపిల్ల ఏ టైపిస్టో, ఏ పంతులమ్మో అయితే చాలనుకునే మనుషులు అంతరించే రోజులొచ్చాయి అల్లుడు గారూ" అన్నాడు ముసలాయన

రామనాదంకి మామగారు చెప్పింది బుర్ర కెక్కింది ఇంత చదువూ చదివి యింకా పాతకాలపు మురికి ఆలోచనలేమిటి తన బుర్ర నిండా – తనకిపుడు మామగారి అనుభవం వెలుగునిచ్చింది

"వసుంధరా!, అమ్మాయినో సారి పిలు, అసలు తనేం చదువుతా నంటుందో అడుగుదాం అన్నాడు రామనాదం

"అమ్మాయి మంచి పనిలో ఉంది

'ఏం పనిలో?

మీరు మెకానిక్ షెడ్డుకి తీసుకెళ్దా లనుకుంటున్నారే మన స్కూటర్ని– మన అమ్మాయి వసంతే రిపేరు చేస్తోంది

ఇక రామనాదానికి పూర్తిగా అర్థమయ్యింది కూతుర్ని ఏం చదివించాలో

●